# గడప గడపకూ గులాబీ దండు

- కేసీఆర్ యాత్రతో శ్రేణుల్లో నూతనోత్సాహం
- హామీలు మరిచిన కాంగ్రెస్‌పై జనంలో నైరాశ్యం
- అన్నీ తానై మాజీ ఎమ్మెల్యే గండ్ర ప్రచారం
- చివరి మూడు రోజులపై ప్రత్యేక ఫోకస్
- పట్టణంలో వార్డుల వారీగా ఇన్‌చార్జిల నియామకం


భూపాలపల్లి పట్టణంలోని వేశాలపల్లిలో ప్రచారం చేస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, మే 8 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కొంత నిరుత్సాహంలో ఉన్న గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జవసత్వాలు నింపారు. ఆయన చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో కదం తొక్కుతున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన వైనాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నీ తానై నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోనూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రచార పర్వం చివరి ఘట్టానికి చేరుకోగా మిగిలిన మూడు రోజుల్లో జనంలోకి మరింత వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలో ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పట్టణంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. పట్టణంలోని 30వార్డులకు ఇన్‌చార్జిలను నియమించారు. వారి ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకు ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

**వార్డు ఇన్‌చార్జిల నియామకం**

పట్టణంలోని 30 వార్డులకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం ఇన్‌చార్జిలను నియమించారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ వారిని సమన్వయం చేస్తూ ప్రచార జోష్‌ను పెంచనున్నారు. 2, 14, 15, 16, 17, 28, 29 వార్డులకు బుర్ర రమేశ్, లట్ట రాజబాబు, దుగ్యాల కిషన్‌రావు, 3, 18, 19, 20, 21, 22, 30 వార్డులకు సెగ్గం సిద్ధు, బుర్ర కుమారస్వామి, నాగుల దేవేందర్‌రెడ్డి, బీబీ చారి, 8, 9, 10, 11, 26, 27 వార్డులకు గండ్ర హరీశ్‌రెడ్డి, చుక్క బాలరాజుగౌడ్, పిల్లి వేణు, ఎండీ కరీం, 4, 5, 6, 7, 23, 24, 25 వార్డుల ఇన్‌చార్జీలుగా మేకల సంపత్‌యాదవ్, కొత్త హరిబాబు, మంగళపల్లి తిరుపతి నియమితులయ్యారు.

**జనంలో పెరిగిన స్పందన**

బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపిన నియోజకవర్గ ప్రజలు పునరాలోచనలో పడ్డట్లు అవగతమతున్నది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించడం, మళ్లీ నియోజకవర్గంలో గడ్డు పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండను సైతం లెక్కచేయక నియోజకవర్గంలోని గ్రామాల్లో తిరుగుతున్నారు.

సాయంత్రం పట్టణంలోని వార్డుల్లో ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి తదితరులు సన్నాహక సమావేశాలకు హాజరయ్యారు. అనంతరం మరోమారు అభ్యర్థి సుధీర్‌కుమార్, మధుసూదనాచారి హాజరై పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మిగతా సమయంలో గండ్ర పూర్తి స్థాయిలో ప్రచారాన్ని తన భుజాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారు.

# అధికారం కోసం మోసం చేసిన కాంగ్రెస్

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం


టేకుమట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్/టేకుమట్ల, మే 8 : అధికారమే లక్ష్యంగా అడ్డగోలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండలంలోని సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్, రామకృష్ణాపూర్(టీ), టేకుమట్ల, పెద్దంపల్లి, పంగిడిపల్లి, వెలిశాల, రాఘరెడ్డిపేట, ఆరెపల్లి, గుమ్మడవెల్లి, కుందనపల్లి, బండపల్లి, వెల్లంపల్లి, దుబ్యాల, మందలోరిపల్లి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని 9, 10 వార్డుల్లోని మంజూర్‌నగర్, పుల్లూరు రామయ్యపల్లి ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ భూ కబ్జాదారుడని, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, ఆమె తండ్రి శ్రీహరి నమ్మక ద్రోహులని, వారి మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన నాయకులు అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అభివృద్ధి కొనసాగాలన్నా, పార్లమెంట్‌లో ప్రజల స మస్యలపై పోరాడాలన్నా బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. సాగు నీరందక వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రచారాల్లో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీసిద్ధు, వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు బుర్ర రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, టీబీజీకేఎస్ నాయకులు, టేకుమట్ల ఎంపీపీ మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ ఐలయ్య, కార్మిక సంఘం మండలాధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి, ఉపాధ్యక్షుడు బొడ్డు సదయ్య, బందెల నరేశ్, ఆది రఘు, లింగారెడ్డి, లక్ష్మణ్, ఉద్దమారి మహేశ్, నేరెళ్ల శ్రీనివాస్, కొలిపాక రాజయ్య, చదువు మధుర, మహేందర్‌రెడ్డి, భాస్కర్, ఓదెలు, రాజు పాల్గొన్నారు.

## చిన్నబోయినపల్లిలో ఆటో డ్రైవర్ల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు, బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం, మే 8 : మండలంలోని చిన్నబోయినపల్లిలో బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు, యాజమానులు బుధవారం ప్రచారం చేశారు. బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలని గ్రామంలోని పలు వార్డులు, ప్రధాన రహదారులు, బస్టాండు సెంటర్లలో కరపత్రాలు పంపిణీచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు ఆదాయం లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పెంచికల లక్ష్మీనారాయణ, ఆడెపు వెంకటేశ్వర్లు, ఖాజా, జితేందర్, వెంకన్న, చిరంజీవి, శ్రీను, చంద్రమొగిళి, మెట్టు రవి, రాంబాబు, ఠాగూర్, శివ, రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, నాయకులు వావిలాల రాంబాబు, గుజ్జేటి రాజశేఖర్, ఫత్తే మహ్మద్ పాల్గొన్నారు.

**గోవిందరావుపేటలో..**

గోవిందరావుపేట : బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోత్ కవితను గెలిపించాలని నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని 18 జీపీల్లో సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామశాఖల అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రజలు, ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

## 'తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి'

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు**

గోవిందరావుపేట, మే 8 : ములుగు జిల్లా వ్యాప్తంగా మంగళవారం కురిసిన భారీ వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు డిమాండ్ చేశారు. మండలంలోని చల్వాయి గ్రామంలోని రైతు వేదిక వద్ద తడిసిన ధాన్యాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో వెంటనే కొనుగోలు చేయాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటు

- ఆరు గ్యారెంటీలపై నాయకులను నిలదీయాలి
- అభివృద్ధి కాంక్షించే కొప్పులను ఆదరించాలి
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు


మల్హర్ : మాట్లాడుతున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మల్హర్, మే 8 : నాటి నుంచి నేటి వరకు ప్రజలకు అబద్ధాలు చెప్పి మోసం చేయడం కాంగ్రెస్‌కు, ఆ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, అడ్వాలపల్లి, మల్లారం గ్రామాల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రాగానే పథకాలను అమలు చేస్తామంటూ మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఓట్ల కోసం వచ్చే నాయకులను ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీయాలన్నారు. తాడిచర్ల నుంచి భూపాలపల్లి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసిందని, అడవిలో పోతున్న చెట్లకు రూ.4కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉండగా మంత్రి శ్రీధర్‌బాబు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి గోసపడుతున్నామని, మళ్లీ ఎంపీ ఎన్నికల్లో ఓటు వేస్తే ఆగమవుతామని అన్నారు. ప్రజాసేవ, అభివృద్ధిని కాంక్షించే కొప్పుల ఈశ్వర్‌ను ఆదరించి, ఆశీర్వందించాలని మధు కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, నాయకులు తాజుద్దీన్, బాలాజీ, హరీశ్, నాగేశ్వర్‌రావు, పులిగంటి నర్సయ్య, రాములు, అజ్మీరా రాజునాయక్, ఆజ్మీరా సమ్మయ్యనాయక్, నారా రమేశ్, శ్రీధర్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలి**

మహదేవపూర్ (కాటారం) : బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలని రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట రామిళ్ల కిరణ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కాగా, మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు ఓడేటి స్వప్నామలారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, నాయకులు పాల్గొన్నారు.

**గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి**

పలిమెల : బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మండలాధ్యక్షుడు జువ్వాజి తిరుపతి అన్నారు. పంకెన, మోదేడు, బోడాయిగూడెం గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ మాయమాటాలు నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో చంద్రకళ, మేకల రాజక్క, నాయకులు పాల్గొన్నారు.

## దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

ములుగు రూరల్, మే 8 : డిగ్రీలో ప్రవేశం పొందే విద్యార్థుల సౌకర్యార్థం ములుగు ప్రభుత్వ కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అధ్యాపకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దోస్త్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఏమైనా తలెత్తితే విద్యార్థులు హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి పరిష్కారం పొందాలన్నారు. దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్‌గా అర్థశాస్త్ర అధ్యాపకుడు ఎం వెంకన్న (9912129128), టెక్నికల్ అసిస్టెంట్‌గా టీ శ్రీను (9963311952)ను నియమించినట్లు తెలిపారు.

## పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

**ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, మే 8 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ములుగు నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహించేందుకు ఈ నెల 12న డిగ్రీ కళాశాలలో సామాగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్‌లో రూట్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎం లోడింగ్‌కు కేటాయించిన సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయకుండా చూడాలన్నారు. జిల్లాలో అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**




★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

**REAL ESTATE**



★ మీ ఇంటి ఖాళీ స్థలాలను, వ్యవసాయ భూములను మాకు డెవలప్‌మెంట్‌కు ఇచ్చి మీరు ఆశించినంత పొందండి. వెంటనే సంప్ర: Cell: 9394326111, 7981174745
NTW-314601

**CHANGE OF NAME**

★ I, KODATI SREEDHAR R/o. 16-5-79, Perukawada, Govt. High School, Warangal Dist-506002. TS. That my Father's Name Changed from K. VENKT KRISHNA to KODATI VENKATA KRISHNA (Late).
NT-327816

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

## నగదు పట్టివేత

కృష్ణకాలనీ, మే 8 : ఎలాంటి అనుమతులు లేకుండా కారులో తీసుకెళ్తున్న నగదును బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సెంటర్‌లో పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా భూపాలపల్లికి చెందిన ప్రసాద్ ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 1,10,080 నగదును తీసుకెళ్తుండగా గుర్తించి, డబ్బులను ఎన్నికల అధికారులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.

**తాడ్వాయిలో..**

తాడ్వాయి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీల్లో పోలీసులు రూ. లక్ష నగదు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం నార్లాపురం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాల్వపల్లి మీదుగా మంచిర్యాల జిల్లా వేమనపల్లికి చెందిన కుర్రు ఆంజేయులు తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## చెరువులో పడి మహిళ మృతి

గణపురం, మే 8 : మతిస్థిమితం కోల్పోయిన మహిళ గణపసముద్రం చెరువులో పడి మృతి చెందిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మామిండ్ల లీల (56)కు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగాలేదు. దీంతో తరచూ చనిపోతానంటూ చెప్పేది. ఈ క్రమంలో బుధవారం గణపసముద్రం చెరువులో మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు.

# ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

**జడ్పీ సీఈవో, స్వీప్ నోడల్ అధికారి విజయలక్ష్మి**


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కృష్ణకాలనీ/గణపురం, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని స్వీప్ నోడల్ అధికారి, భూపాలపల్లి జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డికాలనీ, ఎల్‌బీనగర్, బానోత్ వాడలో అవగాహన, కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గణపురం మండల కేంద్రంలో ఎంపీడీవో ఎల్ భాస్కర్ ఆధ్వర్యంలో ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఈవో మాట్లాడుతూ ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ఇందులో భాగంగానే ఓటర్ల నుంచి 'మేము తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకుంటాం' అని సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాలల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఓనపాకల కుమార్, చిలుముల మధుబాబు, ఆత్మకూరు మహేందర్, కమ్మల ప్రవీణ్‌కుమార్, పులి రాధిక, కాస స్వాతి, గడ్డం నాగమణి, జాడి సుమలత, సెగ్గం శిరీష, చీకట్ల శంకర్, గణపురం ఇన్‌చార్జి ఏపీఎం ఇమాం, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశలు, మహిళా సంఘంసభ్యులు పాల్గొన్నారు.

# 'కవితను భారీ మెజార్టీతో గెలిపించాలి'


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెంకటాపూర్, మే 8 : బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న కోరారు. మండల కేంద్రంలో జడ్పీటీసీ గై అశోక్, మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, సీనియర్ నాయకులు మల్క రమేశ్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ సర్కారు ఒక్క జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, కోమటిరెడ్డి, జానారెడ్డి కుటుంబాలకు రెండు ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలో చక్రం తిప్పాలన్నా, కాంగ్రెస్ మెడలు వంచాలన్నా కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోశాల అనితావీరమల్లు, మాజీ సర్పంచ్ మేడబోయిన అశోక్, కోఆప్షన్ మెంబర్ జహీర్ పాషా, సీనియర్ నాయకులు వీరబోయిన రాజేందర్, హర్జీనాయక్, నర్సింగరావు, సాదా యాదగిరి, మెట్టు నరేశ్, అంతటి రాము, మధుయాదవ్, నర్ర భద్రయ్య పాల్గొన్నారు.

## రైతులను పట్టించుకోని బీజేపీ

**భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు**

చిట్యాల, మే 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో 13నెలలపాటు నిరసన చేపట్టిన రైతులపై ఉక్కుపాదం మోపి 72మంది చావుకు కారణమైందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రామనర్సింహారెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్క విజయ్, మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య సేవలను విస్తరించాలి

**డీఎంహెచ్‌వో అప్పయ్య**

ములుగు రూరల్, మే 8 : ఆయుష్మాన్ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న 12 సేవలను ప్రజలకు వైద్య సిబ్బంది విస్తరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. బుధవారం ములుగులో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి శిక్షణ నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అసంక్రమిత వ్యాధుల నివారణలో భాగంగా జిల్లాలో అందిస్తున్న సేవలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌భాస్కర్, డాక్టర్ నమ్రత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఎఫ్ఎస్ ఫలితాల్లో మెరిసిన మనోళ్లు..

- మన్నెం అజయ్‌కుమార్‌కు ఆల్ ఇండియా 44వ ర్యాంక్
- లవకుమార్‌కు 130వ ర్యాంక్


అజయ్‌కుమార్, లవకుమార్

చిట్యాల/వెంకటాపూర్, మే 8 : యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) బుధవారం విడుదల చేసిన ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) ఫలితాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన యువకులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. చిట్యాల మండలం గుంటూరుపల్లికి చెందిన మన్నెం అజయ్‌కుమార్ ఆల్ ఇండియా 44 ర్యాంకు సాధించగా, వెంకటాపూర్ మండలంలోని గుర్రంపేట పరిధి రాంనాయక్‌తండాకు చెందిన పోరిక లవకుమార్ 130వ ర్యాంక్ పొందాడు. గుంటూరుపల్లిలోని సాధారణ రైతు కుటుంబానికి చెందిన మన్నెం వాసు, భూలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు అజయ్‌కుమార్ 1-5 తరగతి వరకు వరంగల్‌లో, 6-12 వరకు విజయనగరంలోని కోరుకొండ సైనిక్ పాఠశాలలో, బీటెక్ శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో, ఎంటెక్ ఐఐటీ జార్ఖండ్‌లో పూర్తిచేసి కోచింగ్ లేకుండా మొదటి ప్రయత్నంలోనే 44వ ర్యాంక్ సాధించాడు. అజయ్‌కుమార్‌ను మాజీ సర్పంచ్ పువ్వాటి రాణీవెంకటేశ్వర్లు, గ్రామస్తులు అభినందించారు.

**నాలుగో ప్రయత్నంలో..**

రాంనాయక్‌తండాకు చెంది పోరిక సూరిదాస్‌సింగ్-ప్రమీల దంపతుల పెద్ద కుమారుడు లవకుమార్ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని స్థానికంగా పూర్తిచేశారు. వరంగల్‌లోని కాజీపేటలో పదో తరగతి వరకు, ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ కోల్‌కతాలోని ఐఐటీ కాలేజీలో చదివాడు. నాలుగో ప్రయత్నంలో ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. లవకుమార్ తండ్రి సూరిదాస్‌సింగ్ అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

## 10 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, మే 8 : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఈ నెల 10 వరకు పొడిగించినట్లు భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం వరకు జరుగనున్న పోలింగ్ ప్రక్రియను మరో రెండు రోజులు పెంచుతూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని వారు సూచించారు.


## రోడ్డుపై నిలిపిన 63 లారీలకు జరిమానా

ఏటూరునాగారం, మే 8 : జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన ఇసుక లారీలకు ములుగు ఎస్పీ ఆదేశాల మేరకు జరిమానా విధించినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ గీతె మహేశ్ బాబా సాహెబ్ తెలిపారు. ఏటూరునాగారం ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై నిలిపిన 25 ఇసుక లారీలకు రూ. 21,500, అలాగే మంగపేట మండలం గంపోనిగూడెం వద్ద నిలిపిన 38లారీలకు మంగపేట ఎస్సై రూ. 39,330 జరిమానా విధించినట్లు తెలిపారు. ఇసుక ర్యాంపులు నిర్వహించే వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ఏటూరునాగారం, మే 8 : స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని 11 పోలింగ్ స్టేషన్లను పంచాయతీ ప్రత్యేకాధికారి, ఐటీడీఏ ఏవో దామోదర్ స్వామి బుధవారం సందర్శించారు. పంచాయతీ పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, నేజాతీనగర్, మండల పరిషత్, ఉర్దూ మీడియం, ఎక్కెలలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో వసతులను పరిశీలించి ఆయా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## రసాయన శాస్త్రంలో రాజుకుమార్‌కు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న రాజుకుమార్

వెంకటాపూర్, మే 8 : మండలంలోని లక్ష్మీదేవిపేట జీపీ పరిధిలోని వీర్లపల్లికి చెందిన నగావత్ రాజుకుమార్ రసాయన శాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 'డిసైన్ అండ్ సింథసిస్ ఆఫ్ న్యూ పోడోఫోలోటాక్సిన్ డెరివేటివ్స్ అండ్ థేర్ యాంటి క్యాన్సర్ స్క్రీనింగ్' అనే అంశంపై ప్రొఫెసర్ నరసింహస్వామి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజుకుమార్‌ను పలువురు అధికారులు, అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు. కాగా రాజుకుమార్ హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు.

## వడదెబ్బతో యాచకుడు మృతి

పలిమెల, మే 8 : మండలంలోని ముకునూరు పరిధి బండారిగూడెం అటవీ ప్రాంతంలో యాచకుడు ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి కథనం మేరకు వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పరికేడు గ్రామానికి చెందిన గంధం రాజేశ్ (22) తన అక్క, బావలతో కలిసి ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గ్రామాల్లో యాచించిన అనంతరం గుర్రాలపై మండలంలోని ముకునూరు గ్రామానికి వారం క్రితం చేరుకున్నారు. అనంతరం బహిర్భూమికి వెళ్తానని తన అక్క సరోజనతో చెప్పి అటవీ ప్రాంతంలోకి వెళ్లిన రాజేశ్ తిరిగి రాకపోవడంతో ఎదురుచూసిన ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చెసింది. విచారణ చేపట్టిన పలిమెల పోలీసులు బుధవారం ముకునూరు అటవీ ప్రాంతంలో రాజేశ్ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

కాళేశ్వరం, మే 8 : కాళేశ్వరం గోదావరి వద్ద గుర్తు తెలియని మహిళ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఎస్సై భవానీ సేన్‌కు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలికి చేరుకొని తన సిబ్బందితో గోదావరి నుంచి ఎడ్లబండిపై మహిళను బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.